
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
మంగళవారం 29 జూలై 2025



నేత్ర పర్వంగా గోదాదేవి రథోత్సవం



విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ (గోదాదేవి) ఆలయంలో ఆడిపూర ఉత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం కనులపండువగా జరిగింది.

వివరాలు 7లో..

నిండుకుండలా మేట్టూరు డ్యాం



డ్యాం గేట్ల నుండి విడుదలవుతున్న జలాలు



జలమయమైన ఈరోడ్ పళ్ళిపాళయం ప్రాంతం



నామక్కల్‌లో జలమయమైన సంతపేట ప్రాంతం

- లక్ష ఘనపుటడుగుల జలాల విడుదల
- పొంగి ప్రవహిస్తున్న కావేరి వాగు
- 11 జిల్లాలకు వరద హెచ్చరిక

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ప్రధాన జలాశయాల పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా మేట్టూరు డ్యామ్ నీటిమట్టం ప్రమాద స్థితికి చేరింది. దీంతో ఇరిగేషన్ అధికారులు ఆ డ్యామ్ 16 గేట్లను తెరచి సెకనుకు లక్ష ఘనపుటడుగుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఆ నీరంతా కావేరి వాగులో చేరటంతో ఉధృతంగా ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో కావేరి వాగు పరీవాహక ప్రాంతాల్లోని 11 జిల్లాలకు వరద హెచ్చరిక జారీ చేశారు. కర్ణాటకలో కావేరి నది ఆవిర్భావ ప్రాంతమైన కుడగు జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణరాజ సాగర్, కబిని డ్యాంల నుంచి అదనపు జలాలను విడుదల చేశారు. ఆ నీరంతా హొగేనకల్, బిలిగుండ్లు మీదుగా ప్రవహిస్తూ మేట్టూరు డ్యాంలోకి చేరుతున్నాయి. దీంతో సోమవారం ఉదయం మేట్టూరు డ్యాం నీటిమట్టం 120 అడుగులకు చేరింది. డ్యాంలోకి సెకనుకు లక్షా 500 ఘనపుటడుగుల చొప్పున నీరు చేరుతోంది. దీంతో మేట్టూరు విద్యుత్ ప్రాజెక్టు ప్రాంతం నుండి సెకనుకు 18 వేల ఘనపుటడుగులు, డ్యామ్‌లోని 16 గేట్ల ద్వారా సెకనుకు 82 వేల ఘనపుటడుగుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. అంతే కాకుండా తూర్పు, పశ్చిమ కాలువల ద్వారా సెకనుకు 500 ఘనపుటడుగుల మేర సాగునీటిని కూడా విడుదల చేస్తున్నారు. డ్యాం క్రెష్‌గేట్ల్ సమీపంలో ఉన్న తంగమాపురిపట్టణం, అన్నానగర్, పెరియానగర్, సేలం కేంప్ ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు సోమవారం ఉదయం నుంచి వరద హెచ్చరికలు చేస్తున్నారు. కావేరివాగులలో ఎవరూ స్నానం చేయకూడదని, బట్టలు ఉతుకకూడదని హెచ్చరిస్తున్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న కావేరి వాగు వద్ద సెల్ఫీలు తీస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

నామక్కల్ జలమయం...

మేట్టూరు డ్యాం నుండి అదనపు జలాలను విడుదల చేయడంతో నామక్కల్ ప్రాంతం జలమయమైంది. నామక్కల్ జిల్లా కుమారపాళయం కావేరి వాగులో నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో కుమారపాళయం - ఈరోడ్ జిల్లా భవానీ మధ్యనున్న పాత కావేరి వంతెనపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఇదే విధంగా పళ్ళిపాళయం కావేరి వాగు వద్ద కూడా నీరు ఉధ్రుతంగా ఉండడంతో ఫ్లైఓవర్‌పై స్థానికులు నిలబడి ప్రవాహాన్ని తిలకిస్తున్నారు. ఇదిలా ఉండగా పళ్ళిపాళయం సంతపేట ప్రాంతంలో కావేరి వాగు మధ్య ఉన్న మునియప్పన్ సామి విగ్రహం సగం వరకు నీట మునిగింది. కావేరి వాగులో జలాలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సేలం, ఈరోడ్, నామక్కల్, కరూరు, తిరుచ్చి, అరియలూరు, తంజావూరు, తిరువారూరు, మైలాడుదురై, నాగపట్టినం, కడలూరు జిల్లాలకు వరద హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం ఈ 11 జిల్లాల కలెక్టర్లు వరద ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

పాళయంకోటలో పరువుహత్య

- నడిరోడ్డులో ఐటీ ఉద్యోగి హతం
- సోదరితో స్నేహాన్ని సహించలేక యువకుడి ఘాతుకం



హత్యకు గురైన కవిన్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి):తమిళనాడులోని పాళయంకోటలో ఓ యువకుడు పరువు హత్యకు గురయ్యాడు. నిమ్నకులస్థుడైన ఓ యువకుడు అగ్రకులానికి చెందిన తన సోదరితో స్నేహం పెంచుకున్నాడని ఆమె తమ్ముడు నడిరోడ్డులో కత్తితో దాడి చేసి దారుణంగా హతమార్చాడు. ఈ పరువుహత్యకు పాల్పడిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. వివరాలిలా... తూత్తుకుడి జిల్లా ఏరల్ సమీపంలోని ఆరుముగమంగళం ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్, సెల్వి దంపతుల కుమారుడు కవిన్‌కుమార్ (26) చెన్నై ఐటీ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల సెలవులకు స్వస్థలానికి వెళ్ళిన కవిన్‌కుమార్ తన తాతకు అస్వస్థతగా ఉండటంతో ఆదివారం ఉదయం పాళయంకోట కేటీసీ నగర్ ప్రాంతంలో ఉన్న సిద్ధ వైద్య ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆస్పత్రిలో తాతకు చికిత్స జరుగుతుండటంతో కవిన్‌కుమార్ బయట నిలబడ్డాడు. ఆ సమయంలో బైకుపై వచ్చిన ఓ యువకుడు అతడిని పిలిచాడు. కొంత దూరం వెళ్లాక బైకు నిలిపి కవిన్‌కుమార్‌తో ఆ యువకుడు గొడవకు దిగి హఠాత్తుగా కత్తితో దాడి చేసి పారిపోయాడు. కత్తిపోట్లతో కవిన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పాళయంకోట పోలీసులు హుటాహుటిన వెళ్ళి కవిన్ కుమార్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. ఆ తర్వాత ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా కవిన్‌కుమార్‌ను హతమార్చింది పాళయం కోట కేటీసీ నగర్ ప్రాంతానికి చెందిన సుర్జిత్ (24)గా గుర్తించారు. సుర్జిత్ తండ్రి శరవణన్, తల్లి కృష్ణకుమారి ఎస్సైలుగా పనిచేస్తున్నారని తెలిసి, ప్రత్యేక దర్యాప్తు బృందం పోలీసులు సుర్జిత్ సహా, అతడి తల్లిదండ్రులను అరెస్టుచేశారు. అతడిని రహస్య ప్రదేశానికి తీసుకెళ్ళి విచారించగా కవిన్‌కుమార్‌ది పరువుహత్యగా తేలింది. ఉన్నత వర్గానికి చెందిన సుర్జిత్ సోదరి, కవిన్‌కుమార్ బాల్య స్నేహితులు, ఇద్దరూ ఒకే స్కూలు లో చదివారు. సుర్జిత్ సోదరి సిద్ధ వైద్య ఆస్పత్రిలో పనిచేస్తుండటంతో ఆమెను చూడటానికి తరచూ వచ్చేవాడని, ఇద్దరు మాట్లాడుకోవడం చూసి సహించలేక పోయేవాడని పోలీసుల దర్యాప్తులో తెలిసింది. నిమ్న కులానికి చెందిన కవిన్‌కుమార్ తన సోదరితో స్నేహం చేయడాన్ని సహించలేక సుర్జిత్ పథకం ప్రకారం హతమార్చినట్టు వాంగ్మూలం ఇచ్చాడని తెలిపారు. ఈ విచారణ అనంతరం పోలీసులు సుర్జిత్‌పై హత్య, అంటరానితనం నిరోధక చట్టం సహా నాలుగు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉండగా కవిన్‌కుమార్ పరువు హత్యకేసుకు సంబంధించి ఎస్ఐలుగా ఉన్న అతడి తల్లిదండ్రులను కూడా అరెస్టు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తూ, పోలీసు ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు.

కొత్త పార్టీ దిశగా ఓపీఎస్ అడుగులు?

- మోదీ అపాయింట్‌మెంట్ లభించక మనస్తాపం



మాజీముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం

ప్యారీస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండ్రోజులు పర్యటించిన ప్రధాని మోదీ.. తనకు కనీసం నిమిషమైనా అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం పట్ల అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) తీవ్ర మనస్తాపంతో వున్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కు మాత్రం అపాయింట్‌మెంట్ ఇచ్చిన మోదీ.. తనను మాత్రం దూరంగా పెట్టడం పట్ల ఆయన కినుక వహించినట్లు సమాచారం. దీంతో బీజేపీని నమ్ముకుంటే తనకు భవిష్యత్తు లేదని భావిస్తున్న ఓపీఎస్.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌తో చేతులు కలపడంపై ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆయన మద్దతుదారులతో ఏర్పాటైన హక్కుల పరిరక్షణ కమిటీ అనే విభాగాన్ని రాజకీయ పార్టీగా మార్చాలని నిర్ణయించినట్లు సమాచారం. కొత్త పార్టీకి ఎంజీఆర్-అమ్మ అన్నాడీఎంకే అనే పేరు ఎంపిక చేశారని, కొత్త పార్టీ నిర్ణయాన్ని సెప్టెంబర్ 4న మదురైలో నిర్వహించనున్న మహానాడులో ఓపీఎస్ ప్రకటిస్తారని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు.

ఆరోగ్య పథకాలన్నీ భేష్

- నర్సుల సేవలు ప్రశంసనీయం
- డిప్యూటీ సీఎం ఉదయనిధి



నర్సుకు అవార్డు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగేళ్లకు పైగా డీఎంకే ద్రావిడ తరహా పాలనలో అమలుచేసిన వైద్య, ఆరోగ్య పథకాలన్నీ భేషుగ్గా ఉన్నాయని, ఇతర రాష్ట్రాలు కూడా ఈ పథకాలను స్ఫూర్తిగా తీసుకుని అమలు చేసేందుకు ఆసక్తికనబరుస్తున్నాయని డిప్యూటీ సీఎం ఉదయనిధి పేర్కొన్నారు. సోమవారం ఉదయం వళ్లువర్‌కోట్టంలో ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన రాష్ట్ర నర్సులు, ప్రసూతి నర్సుల మండలి శతవార్షికోత్సవాల ప్రారంభ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విశిష్టసేవలందించిన నర్సులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నర్సుల మండలి అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ రాజమూర్తి తనకు స్వయానా మేనమామ అని, తనను పెంచి పోషించింది కూడా ఆయనేనని, ఇద్దరూ గోపాలపురంలోని కలైంజర్ నివాసంలో ఒకే గదిలో ఉనానమన్నారు. ఇద్దరం కలిసి చదివామని, రాజమూర్తి బాగా చదవి డాక్టర్ అయ్యారని, తాను సక్రమంగా చదవకుండా రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రి అయ్యానని చెప్పారు. గత వారం రోజులుగా తానెక్కడికి వెళ్ళినా ముఖ్యమంత్రి ఎలా వున్నారు? దళపతి ఎలా ఉన్నారు? అంటూ ప్రజలు, పార్టీ శ్రేణులు ప్రశ్నించారని, పార్టీ నేత కులాసాగా ఉన్నారని వారికి చెబుతూ వచ్చానని, ఆదివారం రాత్రి అపోలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాకే రాష్ట్ర ప్రజలు, పార్టీ కార్యకర్తలు కుదుటపడ్డారని చెప్పారు. స్టాలిన్ త్వరగా కోలుకోవటానికి వైద్యులతో పాటు నర్సులు కూడా కారణమనే విషయాన్ని ఎవరూ మరచిపోకూడదన్నారు. రోగులను సంరక్షించడంలో నర్సులు ప్రధాన పాత్ర పోషిస్తారని, త్వరగా కోలుకుంటారంటూ వాళ్లు చెప్పే ఓ మాట రోగుల్లో భయాన్ని పోగొడుతుందన్నారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతంలో అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలు సత్ఫలితాలిస్తున్నాయని, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పాలనలోనే రోగులకు అవసరమైన రక్తం సులువుగా లభించేందుకు బ్లడ్ బ్యాంక్‌లు ఏర్పాటు చేశారని ఉదయనిధి గుర్తు చేశారు. ఇళ్లవద్దకే వైద్యం ప్రారంభించి ముఖ్యమంత్రి స్టాలిన్ పేద ప్రజలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కొత్త ఆసుపత్రులను నిర్మించడంపై స్టాలిన్ ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధచూపుతారని ఉదయనిధి పేర్కొన్నారు.

యాపిల్ ఎలక్ట్రానిక్స్ హబ్‌గా తమిళనాడు

- రూ.30 వేల కోట్ల పెట్టుబడులు
- 60 వేల మందికి ఉపాధి అవకాశాలు
- మంత్రి టీఆర్‌బీ రాజా



అడయార్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం యాపిల్ సప్లయర్స్ అండ్ ఎకో సిస్టమ్ కంపెనీ (యాపిల్ ఎలక్ట్రానిక్స్) హబ్‌గా మారనుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా వెల్లడించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన తమిళనాడు ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ పథకం కింద రూ.30 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, 60 వేల మందికి ఉపాధి అవకాశాల రూపకల్పనే ధ్యేయంగా ముందుకుసాగుతున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం మంత్రి మీడియా తో మాట్లాడుతూ.. యాపిల్ గ్రూప్ ఆఫ్ కంపెనీలు దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే తమిళనాడులో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు. రాష్ట్రంలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు ఇలాంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. గత ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన తమిళనాడు ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ పథకం గతంలో కేంద్రం ప్రకటించిన పథకంతో సమానంగా ఉందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలను ప్రకటిస్తూ పెట్టుబడిదారులను ఆకర్షిస్తుందన్నారు. ఈ పథకం కింద రూ.30 వేల కోట్ల పెట్టుబడులు, 60 వేల ఉపాధి అవకాశాలను సృష్టించనున్నట్టు తెలిపారు. యాపిల్ కంపెనీని రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు తొలి ప్రాధాన్యత ఇచ్చామని, ఇది విజయవంతంగా పూర్తయిందన్నారు. రాష్ట్రంలోని మౌలికసదుపాయాలు, మానవవనరుల గురించి యాపిల్ కంపెనీ నిర్వాహకులు తెలుసుకుని, రాష్ట్రానికి తొలి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. యాపిల్‌కు వరల్డ్ సప్లయర్‌గా ఫాక్స్‌కాన్ ఉందని, ఇది తమిళనాడులో ఐఫోన్లు తయారు చేసి తొలి ఫోన్లను అమెరికాకు ఎగుమతి చేసిందన్నారు. దేశంలో తమిళనాడు రాష్ట్రం నుంచి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతులు 41.2 శాతం ఉందని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 14.65 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను ఎగుమతి చేసినట్టు ఆయన వెల్లడించారు. వచ్చే మూడు లేదా నాలుగేళ్ళలో ఇది 50 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కొత్త ప్లాంట్ ద్వారా కెమెరా, డిస్‌ప్లే మాడ్యుల్స్, సెన్సార్లు, హెచ్‌డీఐ, లి-ఐయాన్ సెల్స్ వంటి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను తయారు చేస్తామని మంత్రి రాజా వెల్లడించారు.

రూ.100 కోట్ల ఆదాయం లక్ష్యం

- విద్యుత్ స్తంభాలు, రోడ్డు డివైడర్లపై ప్రకటనలు
- జీసీసీ ప్రణాళిక



చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) తన ఆదాయ వనరులను పెంచుకునే దిశగా కీలకమైన నిర్ణయాలను తీసుకుంటోంది. ఆ మేరకు ప్రకటనల ద్వారా రూ.100 కోట్ల మేర ఆదాయాన్ని సమకూర్చుకోవాలని నిర్ణయించింది. నగరంలోని విద్యుత్ స్తంభాలు, రోడ్డు డివైడర్లను వాణిజ్య ప్రకటనల కోసం ప్రైవేటు సంస్థలకు అనుమతినిచ్చి మూడేళ్లలో రూ.100 కోట్లు ఆదాయం చేకూర్చుకోవాలని భావిస్తోంది. నగరంలో సిటీ బస్సులు తిరిగే రహదారులలో స్తంభాలపై ప్రకటన బోర్డులు పెట్టుకునేందుకు, డివైడర్ గోడలు, ఆ గోడలపైనున్న చిన్న స్తంభాలపై కూడా ప్రకటనల కోసం కేటాయించడానికి సిద్ధమైంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ ప్రకటన బోర్డులు పెట్టుకునేందుకు, గోడలపై పెయింటింగ్ ప్రకటనలు చేసుకునేందుకు ఆరేళ్లపాటు లైసెన్స్ జారీ చేయాలని కార్పొరేషన్ పాలకమండలి నిర్ణయించింది. విద్యుత్ స్తంభాలు, రోడ్డు డివైడర్ల వద్ద 0.6 మీటర్ పొడవు, మీటర్ వెడల్పుతో కూడిన ప్రకటన బోర్డులు పెట్టుకునేందుకు అనుమతిస్తుంది. అలా అనుమతించిన ప్రకటన లకు చదరపు మీటర్‌కు రూ.3 వేల చొప్పున ఛార్జీ వసూలు చేయనున్నారు. ప్రకటనబోర్డుల కొయ్య లేదా అల్యూమినియం ఫ్రేంలు 3 సెం.మీల. వెడల్పు, .5 సెం.మీ.ల పొడవుండాలని కూడా సూచించారు. ఈ నిబంధనలతో ప్రకటనలకు అనుమతులిచ్చి రూ.100 కోట్ల మేరకు ఆదాయం పెంపొందించుకోవాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నిర్ణయించినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఉద్ధవ్‌కు సీఎం స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శివసేన (యూబీటీ) అధ్యక్షులు ఉద్ధవ్ థాకరే జన్మదినం సందర్భంగా, ఆయనకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం స్టాలిన్ తన 'ఎక్స్' పేజీలో... 'శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరేకు జన్మదిన శుభాకాంక్షలు. హిందీ నిర్బంధాన్ని ధైర్యంగా వ్యతిరేకించడం, మహారాష్ట్ర గుర్తింపును నిలబెట్టుకోవాలనే మీ దృఢమైన వైఖరి, మాతృభాషను కాపాడుకునేలా మహారాష్ట్ర ప్రజలను ఐక్యం చేయడం అభినందనీయం. సమాఖ్యవాదం, భాషా గౌరవాన్ని కాపాడుకోవడంలో కొనసాగిస్తున్న పయనంలో మీకు బలం చేకూరాలని కోరుకుంటున్నాను' అంటూ సీఎం స్టాలిన్ ట్వీట్ చేశారు.

రాజ్యసభలో అన్నాడీఎంకే ఎంపీల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీలు ఇన్బదురై, ధనపాల్

ప్యారీస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికైన అన్నాడీఎంకే సభ్యులు ఇన్బదురై, ధనపాల్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. తమిళనాడు తరుపున రాజ్యసభలో 18 మంది సభ్యులుగా వ్యవహరిస్తుండగా, వీరిలో ఆరుగురి పదవీకాలం ఈ నెల 6తో ముగిసింది. ఈ పదవులను భర్తీ చేసేందుకు జూన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో డీఎంకే తరఫున నలుగురు పోటీచేశారు. అన్నాడీఎంకే నుంచి సీనియర్ న్యాయవాది ఐఎస్ ఇన్బదురై, ధనపాల్ బరిలో నిలవగా, ఈ ఆరుగురు ఏకగ్రీవంగా రాజ్యసభకు ఎన్నికైనట్లు ఈసీ ప్రకటించిన విషయం తెలిసిందే. గత శుక్రవారం డీఎంకే సభ్యులచేత రాజ్యసభ వైస్ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం అన్నాడీఎంకే సభ్యులైన ఐఎస్ ఇన్బదురై, ధనపాల్‌ల చేత ప్రమాణస్వీకారం చేయించారు. అన్నాడీఎంకే తరుపున ప్రస్తుతం డాక్టర్ తంబిదురై, సీవీ షణ్ముగం, చంద్రశేఖరన్, ధర్మర్ (ఓపీఎస్ మద్దతుదారులు) పెద్దల సభలో సభ్యులుగా కొనసాగుతున్న నేపథ్యంలో తాజాగా మరో ఇద్దరు చేరికతో ఆ పార్టీ బలం ఆరుకు పెరిగింది. అదేవిధంగా డీఎంకే సభ్యుల సంఖ్య 11కు పెరిగింది.

సమాచార దర్శిని

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా స్థానిక బీసెంట్ నగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. రుక్మిణి రోడ్డు, బీచ్ రోడ్డు, అరుణ్‌డెల్ బీచ్ రోడ్డు, 7వ అవెన్యూ, 30వ క్రాస్ వీధి, ఎంజీఆర్ రోడ్డు, టైగర్ వరదాచారి రోడ్డు, ముత్తులక్ష్మి వీధి, లక్ష్మీపురం, షోలింగనల్లూర్ పరిధిలోని 200 అడుగుల రేడియల్ రోడ్డు, రాజం నగర్, విడుదలై నగర్, పెరియ కోవిల్‌పాక్కం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

కాలువల పునరుద్ధరణకు రూ.86 కోట్లు

పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీసీసీ పరిధిలోని ఏడు మండలాల్లో, తీవ్రంగా దెబ్బతిన్న కాలువల పునరుద్ధరణకు రూ.86 కోట్లు కేటాయించారు. తండయార్‌పేట, రాయపురం, తిరువిక నగర్, అంబత్తూర్, అన్నానగర్, తేనాంపేట, వలసరవాక్కం, అడయారు తదితర మండలాల్లో 57 ప్రాంతాల్లో ఉన్న కాలువలు తీవ్రంగా దెబ్బతిని నీరు వెళ్లేందుకు కూడా వీలులేదు. ఇటీవల నిర్వహించిన సర్వేలో, రుతుపవన వర్షాలతో ఆయా ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యే అవకాశాలున్నాయని తేలింది. ఈ కాలువలు పునరుద్ధరించేందుకు రూ.86 కోట్లు కేటాయించినట్లు, ఆగస్టులో పనులు ప్రారంభించి వర్షాలు ప్రారంభానికి ముందే ముగించేలా చర్యలు చేపట్టినట్లు జీసీసీ తెలిపింది.

శిథిలావస్థకు చేరిన 18 భవనాల కూల్చివేత

పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో అత్యంత దెబ్బతిన్న 18 భవనాలు కూల్చివేయాలని కార్పొరేషన్ నిర్ణయించింది. స్థానిక రాజా అన్నామలైపురంలోని అమ్మ క్యాంటీన్, పల్లికరనై డంపింగ్ యార్డ్‌లో ఉన్న ఎరువుల షెడ్, కన్నిగినగర్, షోలింగనల్లూర్, కారపాక్కం తదితర ప్రాంతాల్లో ఉన్న చెత్త వేరుచేసే కేంద్రాలు, గ్రంథాలయం, ప్రాథమిక పాఠశాలల భవనాలు, వ్యాయామ కేంద్రం సహా 18 భవనాలు కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. భవిష్యత్తులో ఈ భవనాలతో ప్రమాదాలు జరగకుండా ఉండేలా వాటిని కూల్చివేయాలని నిర్ణయించినట్లు, రెండు రోజుల్లో కూల్చివేసే పనులు చేపట్టనున్నట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

పెరుంబాక్కంలో 8,352 గృహాల పునరుద్ధరణ

పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరుంబాక్కంలోని హౌసింగ్ బోర్డు స్కీమ్‌లో ఉన్న 8,352 గృహాలను రూ.70 కోట్లతో పునరుద్ధరించనున్నారు. రాష్ట్రంలో అత్యధిక నివాస ప్రాంతాలు కలిగిన పెరుంబాక్కం అర్బన్ హాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డు హౌసింగ్ కాలనీలో 210 బ్లాక్‌ల్లో 28వేలకు పైగా గృహాలు నిర్మించగా, 24వేల గృహాల్లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో, పదేళ్ల క్రితం నిర్మించి దెబ్బతిన్న గృహాలను పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఆ ప్రకారం, 87 బ్లాకుల్లోని 8,532 ఇళ్లలో కూలింగ్ ఫ్లోర్ టైల్స్ వేయడం, పగుళ్లు సరిచేయడం, టాయిలెట్ల పునరుద్ధరణ, పెయింటింగ్ తదితర పనులకు రూ.70 కోట్లు కేటాయించినట్లు, త్వరలో పనులు ప్రారంభించి వర్షాలకు ముందే పూర్తిచేయాలని నిర్ణయించినట్లు బోర్డు అధికారులు తెలిపారు.

విద్యార్థులకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యార్థులు, మహిళలకు ప్రత్యేక బస్సుల ఏర్పాటుపై మెట్రోట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (జీసీసీ) పరిశీలిస్తోంది. నగరంలో నడుపుతున్న ఎంటీసీ బస్సుల్లో ప్రతిరోజు విద్యార్థులు, మహిళలు సుమారు 40 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లే వారితో ఉదయం 8 నుంచి 10 గంటలు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు (పీక్ అవర్స్)లో బస్సుల్లో రద్దీ అధికంగా ఉంటోంది. బస్సు లోపలికి వెళ్లలేని పరిస్థితుల్లో విద్యార్థులు ఫుట్‌బోర్డుపై ప్రయాణించి ప్రమాదానికి గురైన ఘటనలున్నాయి. ఈ సమస్య పరిష్కరించేలా పీక్ అవర్స్‌లో మహిళలకు 30 ప్రత్యేక బస్సులు, విద్యార్థులకు 50 ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించినట్లు, ఈ విషయమై త్వరలో అధికారికంగా ప్రకటించనున్నట్లు ఎంటీసీ అధికారులు తెలిపారు.

మినీ బస్సు పథకం అమలులో జాప్యం

ప్యారీస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక లోటు, రూట్ల నిర్ధారణ జరుగకపోవడంతో, రాష్ట్రంలో కొత్తగా మినీ బస్సు పథకంలో జాప్యం చోటుచేసుకుంది. రవాణా సదుపాయం లేని కుగ్రామాలకు 1997లో మినీ బస్సు సేవలు ప్రారంభించారు. ఏప్రిల్‌లో ప్రారంభించిన కొత్త మినీ బస్ పథకం ప్రకారం, ప్రతి 25 కి.మీ కు ఓ మినీ బస్సు నడపాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వాస్పత్రులకు గ్రామీణ ప్రాంతాల ప్రజలు సులువుగా వెళ్లేలా మినీ బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీని ప్రకారం, 3,103 రూట్లలో ఉన్న సుమారు 90వేలకు పైగా గ్రామాల్లో నివసిస్తున్న కోటి మంది లబ్ధిపొందేలా కొత్త మినీ బస్సు పథకాన్ని సీఎం స్టాలిన్ ఈ నెల 16న తంజావూరులో ప్రారంభించారు. అయితే, ఈ పథకం అమలులో ఇంకా స్పష్టత రాకపోవడం, రూట్ల ఎంపిక నిర్ధారణ తదితరాలు పూర్తికానందున, ఈ పథకం ప్రారంభంలో జాప్యం చోటుకున్నట్లు అధికారులు సమాచారం.

'గుడ్డు' కూడా ఇవ్వలా..!

● విద్యాభివృద్ధికి నిధులివ్వలేదంటూ కాంగ్రెస్ నిరసన

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడం లేదంటూ 'సమగ్ర శిక్షా అభియాన్' పథకం కింద రాష్ట్రానికి రావాల్సిన నిధుల్లో ఒక్క పైసా కూడా ఇవ్వని కేంద్రప్రభుత్వ తీరును నిరశిస్తూ కాంగ్రెస్ విద్యార్థి విభాగం సోమవారం వినూత్న ధర్నా చేపట్టింది. టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్ వద్ద కాంగ్రెస్ రాష్ట్ర విద్యార్థి విభాగ అధ్యక్షుడు చిన్న తంబి నేతృత్వంలో జరిగిన ఈ ధర్నాను టీఎన్‌సీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి ప్రారంభించారు. వందమందికి పైగా పాల్గొన్న ఈ ధర్నా సందర్భంగా నిరసనకారులు కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. రాష్ట్రానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ 'గుడ్డు' కూడా ఇవ్వలేదంటూ.. ఆయన చిత్రపటానికి కోడిగుడ్లు తినిపిస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవి మీడియాతో మాట్లాడుతూ.. ఒక రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఏడాదిపాటు నిలిపేయడమంటే ఆ రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని అర్థమవుతోందన్నారు.


ధర్మేంద్రప్రదాన్ చిత్రపటానికి గుడ్డు తినిపిస్తున్న నిరసనకారులు

ఏడాదిలో పైసా కూడా ఇవ్వలేదంటే ఆ రాష్ట్రంలో వున్న విద్యార్థులంతా చదువు మానేయాలని కేంద్రం భావిస్తోందా? అని ప్రశ్నించారు. అన్ని రకాలుగా ప్రజల విశ్వాసం కోల్పోయిన మోదీ ప్రభుత్వం.. దక్షిణాదిపై ఎనలేని వివక్ష చూపుతోందని, మరీ ముఖ్యంగా తమిళనాడు, కేరళ రాష్ట్రాలపై ఈ వివక్ష అధికంగా కనిపిస్తోందని దుయ్యబట్టారు.

కారు డ్రైవర్ నిజాయితీ

● పోలీసులకు నగల అప్పగింత

ప్యారీస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అద్దె కారులో లభించిన రూ.5 లక్షల విలువైన వజ్రాభరణాలను పోలీసులకు అప్పగించిన డ్రైవర్ నిజాయితీని పలువురు అభినందించారు. స్థానిక పెరుంబాక్కంకు చెందిన సుజాత టి.నగర్‌లోని జీఆర్‌టీ జ్యువెలరీస్‌లో వజ్రాభరణాలు కొనుగోలు చేసి అద్దె కారులో ఇంటికి వెళ్లారు. ఇంట్లోకి వెళ్లిన ఆమె, నగలతో కూడిన బ్యాగు కారులోనే మరచిపోయారు. ఈ విషయమై ఆమె మాంబళం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, తన కారులో సుజాత వదిలివెళ్లిన నగలను డ్రైవర్ మణివన్నన్ ఫ్లవర్ బజార్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. దీంతో, సుజాతను పోలీస్ స్టేషన్‌కు పిలిచి వజ్రాభరణాలు అప్పగించిన పోలీసులు డ్రైవర్ నిజాయితీని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

ప్యారీస్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సమీపం అక్కాళ్‌మఠం ప్రాంతంలో ఆటో, సరుకు వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఆటోడ్రైవర్ పరమేశ్వరన్, శరవణన్ తదితరులు తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గ్యాస్ లీకై భర్త మృతి: మహిళకు సీరియస్

ప్యారీస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో గ్యాస్ సిలిండర్ లేకవడంతో అగ్నిప్రమాదం సంభవించి భర్త మృతిచెందగా, భార్య తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాశిమేడు దురై వీధికి చెందిన జాలరి శేఖర్ (70) భార్య మంజుల (60) ఆదివారం వంట చేసేందుకు గ్యాస్ స్టవ్ వెలిగించింది. ఆ సమయంలో, గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఈ ఘటనతో వంట గదిలోని వస్తువులతో పాటు మంజుల కూడా మంటల్లో చిక్కుకుంది. ఆమెను రక్షించేందుకు యత్నించిన శేఖర్ మంటల్లో చిక్కుకుని ఘటనా స్థలంలోనే మృతిచెందగా, మంజులకు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల ఆమెను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాయపురం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

లాకప్‌డెత్ కేసులో మృతుడి తల్లి, తమ్ముడిని విచారించిన సీబీఐ

ప్యారీస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లాలో లాకప్‌డెత్ కేసులో మృతుడు అజిత్‌కుమార్ తల్లి, తమ్ముడిని సీబీఐ అధికారులు విచారించారు. కాళికాలయ వాచ్‌మన్ అజిత్ కుమార్, నగలు చోరీ చేశారనే ఫిర్యాదుతో అతడిని ప్రత్యేక విభాగం పోలీసులు విచారణకు తీసుకెళ్లారు. విచారణ సమయంలో అతడిని హింసించడంతో మృతిచెందాడు. ఈ ఘటనతో సంబంధమున్న ఐదుగురు ప్రత్యేక విభాగం పోలీసులను అరెస్ట్ చేశారు. అనంతరం ఈ కేసు విచారణ సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ కేసును విచారిస్తున్న హైకోర్టు మదురై బెంచ్, విచారణ నివేదిక ఆగస్టు 20వ తేదిలోగా సమర్పించాలని సీబీఐని ఆదేశించింది. సీబీఐ విచారణ అధికారిగా ఢిల్లీకి చెందిన మోహిత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ నెల 14న సీబీఐ విచారణ ప్రారంభించిన నేపథ్యంలో, ఈ కేసుకు సంబంధించి మృతుడి తల్లి, తమ్ముడిని మదురై ఆత్తికుళం ప్రాంతంలోని సీబీఐ కార్యాలయానికి సోమవారం రప్పించి విచారించారు.

టీవీ చూడవద్దని మందలింపు

● బాలిక ఆత్మహత్య

తిరుత్తణి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): టీవీ చూడొద్దని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే తిరువళ్లూరు జిల్లా వెళ్లియూర్ ప్రాంతానికి చెందిన జాన్సన్ ఓ ప్రైవేటు కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య శరణ్య, కుమార్తెలు కావ్య (14), భవ్యశ్రీ (9) ఉన్నారు. ఈ నేపథ్యంలో, ఆదివారం సాయంత్రం టీవీ చూస్తున్న కావ్యను తన తల్లి మందలించింది. చదువుకోకుండా టీవీ చూడటమేమిటని కోపంగా టీవీ కట్టేసింది. మనస్తాపానికి గురైన కావ్య తన బెడ్‌రూమ్‌కు వెళ్ళి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు చేసుకుంది. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన తల్లి వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్ళింది. పరిశీలించిన వైద్యులు బాలిక మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చర్యలు చేపట్టారు.

కామాక్షితాయి అన్నదాన సదనానికి రూ.10 లక్షల విరాళం


రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న మల్లికార్జున, ప్రభావతి దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాళెం మండలంలోని జొన్నవాడ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయ నిత్యాన్నదాన సదనానికి చెన్నై నగరంలోని మొగలివాకం వాస్తవ్యులు కె.మల్లికార్జున, ప్రభావతి దంపతులు సోమవారం రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఆలయ ఈఓ ఏవీ. శ్రీనివాసుల రెడ్డిని కలిసి వారు చెక్కును అందజేశారు. దాత తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవారి దర్శనం చేసుకున్నారు. పూజల అనంతరం వారికి తీర్థప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలను ఆలయ అధికారులు అందజేశారు.


విరుగంబాక్కంలోని శ్రీదేవి, భూదేవి, శ్రీపెరుందేవి తాయర్ సమేత సుందర వరదరాజపెరుమాళ్ ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ సేవ

చోరీకి వచ్చి.. మద్యం మత్తులో నిద్రపోయాడు !

పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చోరీకి వచ్చిన ఇంట్లో మద్యం మత్తులో నిద్రపోయిన యువకుడిని, ఆ ప్రాంత ప్రజలు పోలీసులకు అప్పగించారు. దిండుగల్ జిల్లా వేడచెందూర్‌లోని కడై వీధిలో నివసిస్తున్న బషీర్, సోమవారం ఉదయం తమ ఇంటి మేడపైకి వెళ్లిన సమయంలో, అక్కడ ఓ యువకుడు నిద్రిస్తుండడం గమనించి చుట్టుపక్కల వారిని పిలిచాడు. వారు వెళ్లి అతడిని లేపి, మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. అదే సమయంలో, మేడ సమీపంలోని వస్త్ర దుకాణం కిటికీ తొలగించేందుకు యత్నించినట్లు సుత్తి తదితర పరికరాలు చూశారు. సమాచారం అందుకున్న వేడచెందూర్ పోలీసులు అక్కడకు చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఉత్తరాది రాష్ట్రానికి చెందిన వాడిగా గుర్తించిన పోలీసులు విచారించగా, ఇద్దరు యువకులు ఆదివారం రాత్రి మద్యం సేవించారని, 11 గంటల ప్రాంతంలో ప్రజలు నిద్రపోతున్న సమయంలో సమీపంలోని వస్త్ర దుకాణంలో చోరీ చేసేందుకు యత్నించగా, పూర్తి మద్యం మత్తులో ఉండడంతో వారి ప్రయత్నాలు ఫలించలేదని, వారిలో ఒకరు మత్తులో నిద్రపోగా, మరొకరు పారిపోయాడని గుర్తించిన పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేసి పరారైన మరో యువకుడి కోసం గాలిస్తున్నారు.

సీహార్స్ కలిగిన వ్యక్తి అరెస్టు

అడయార్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా మరక్కాణం సమీపంలో సముద్ర జలచరాలైన సీహార్స్ కలిగివున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వ్యక్తిని మరక్కాణంకు చెందిన తమీమ్ అన్సారీ (47)గా గుర్తించారు. ఆయన వద్ద నుంచి 14 సీహార్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆయనపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

11 మంది గంజాయి విక్రేతలపై చర్యలు

● తాంబరం కమిషనర్ అభిన్ దినేష్

అడయార్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తాంబరం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు జరిపిన సోదాల్లో గంజాయితో పట్టుబడిన 11 మందిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తాంబరం పోలీస్ కమిషనర్ అభిన్ దినేష్ వెల్లడించారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ, ఈ నెల 26వ తేదీ కాంటూన్‌కుళత్తూరు తదితర ప్రాంతాల్లో పోలీసులు జరిపిన తనిఖీల్లో గంజాయితో పాటు నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి విక్రయం, సరఫరా చేసినందుకు ఇప్పటివరకు 318 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ యేడాది 1,516 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, దీనికి సంబంధించి 341 మందిని అరెస్టు చేశామన్నారు. మరో 1,208 కేజీల మత్తుపదార్థాలను ధ్వంసం చేశామన్నారు. గంజాయి విక్రయం, సరఫరా చేసినందుకు ఇప్పటివరకు 11 మందిని అరెస్టు చేయగా, వారిపై గూండా చట్టం ప్రయోగించామన్నారు. అంతేకాకుండా, వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి గంజాయి వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాంబరం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ గంజాయి రవాణా, వినియోగం, విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని ఆయన వెల్లడించారు.

టాస్మాక్ బార్‌లో వ్యక్తి హత్య

● ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడంబాక్కంలోని టాస్మాక్ బార్‌లో ఆదివారం సాయంత్రం మద్యం సేవిస్తున్న వ్యక్తిని హతమార్చిన వ్యవహారంలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. క్రోంపేటకు చెందిన పరంధామన్ (44) కోడంబాక్కం ప్రాంతంలోవున్న ఓ హార్డ్‌వేర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆయన ఆదివారం సాయంత్రం పని ముగించుకుని ఆర్కాడు రోడ్డులోవున్న టాస్మాక్ బార్‌లో మద్యం తాగుతున్న సమయంలో అదే దుకాణంలో మద్యం సేవిస్తున్న ముగ్గురు యువకులతో ఘర్షణ జరిగింది. ఇంతలో ఆగ్రహం చెందిన ఆ ముగ్గురు యువకులు పరంధామన్‌పై విరుచుకు పడటంతో బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై టాస్మాక్ బార్ సిబ్బంది ఫిర్యాదు మేరకు వడపళని పోలీసులు కేసు నమోదు చేసి మద్యం మత్తులో పరంధామన్‌తో గొడవపడి హత్యచేసిన కోడంబాక్కంకు చెందిన రాజ్ (30), కామరాజ్ (32), సోమవారం ఉదయం అరెస్టు చేసి, పరారీలో ఉన్న మూడోవ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఇళయరాజా పిటిషన్ కొట్టేసిన సుప్రీంకోర్టు

అడయార్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కోటిన్నర రూపాయల నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ప్రముఖ ఆడియో కంపెనీ సోనీ మ్యూజిక్ ముంబై హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్ సోమవారం ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ ధర్మాసనం ముందు విచారణకు రాగా, ఇళయరాజా తరపున న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ హాజరై.. 2022లో రూ.1.50 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ సోనీ మ్యూజిక్ ముంబై హైకోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలి' అని కోరారు. ఈ వినతిని తోసిపుచ్చిన ధర్మాసనం ఇళయరాజా పిటిషన్‌ను కొట్టివేసింది.

ఆమ్‌స్ట్రాంగ్ కేసు సీబీఐకి బదిలీ చేయాలని పిటిషన్

● తీర్పు వాయిదావేసిన హైకోర్టు

పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసును సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ కేసులో పలు రాజకీయపార్టీల నేతలతో సంబంధాలున్నాయని, వాస్తవాలు వెలుగు చూడాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై వాదోపవాదాలు ముగిసిన నేపథ్యంలో, తేది ప్రకటించకుండా మద్రాసు హైకోర్టు తీర్పు వాయిదా వేసింది.

నేటినుంచి శివగంగ జిల్లాలో ఈపీఎస్ ప్రచారం

పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మంగళ, బుధవారాల్లో శివగంగ జిల్లాల్లో పర్యటించనున్నారు. 'మక్కులై కాప్పోం...తమిళగత్తై మీట్పోం' నినాదంతో ఈ నెల 7 నుంచి రాష్ట్రంలోని శాసనసభ నియోజకవర్గాల్లో పళనిస్వామి పర్యటిస్తున్నారు. అందులో భాగంగా, శివగంగ జిల్లాలోని కారైక్కుడి, తిరుపత్తూర్, శివగంగ, మానామదురై తదితర నాలుగు నియోజకవర్గాల్లో ఆయన పర్యటించనున్నారు.మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు కారైక్కాడి ఎంజీఆర్ విగ్రహం సమీపంలో ప్రసంగించనున్న పళనిస్వామి, 5.30 గంటలకు తిరుపత్తూర్ అన్నా విగ్రహం సమీపం, రాత్రి 7.45 గంటలకు శివగంగ అరన్మనైవాసల్‌లో ప్రజలను కలుసుకోనున్నారు. రాత్రికి శివగంగలో బసచేసి, బుధవారం ఉదయం 10 గంటలకు ప్రవాస భారతీయులను కలుసుకోనున్నారు. అనంతరం, వ్యవసాయ సంఘాలు, క్రీడాకారులు సహా పలు సంఘాల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. సాయంత్రం 4.30 గంటలకు మానామదురై దేవర్ విగ్రహం సమీపంలో ప్రజలను కలుసుకోనున్న పళనిస్వామి, అనతరం రామనాథపురం జిల్లాకు వెళ్లనున్నారు. పళనిస్వామికి ఘనస్వాగతం పలికేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ సన్నాహాలు చేపట్టారు.

పురావస్తు తవ్వకాలకు నిధుల తగ్గింపు

● కేంద్రం తీరుపై సీపీఎం ఎంపీ ఖండన

పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పురావస్తు తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గించడంపై మదురై సీపీఎం ఎంపీ వెంకటేశన్ ఖండించారు. ఈ మేరకు తన 'ఎక్స్' పేజీలో... గత ఐదు సంవత్సరాల్లో గుజరాత్ రాష్ట్రంలో పురావస్తు తవ్వకాల పనులకు ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా మొత్తం నిధుల్లో 25 శాతం (రూ.8.53 కోట్లు) ఖర్చు చేసిందన్నారు. ఇందులో 94 శాతం ప్రధాని మోదీ జన్మస్థలమైన వాద్ నగర్‌లో ఖర్చుచేశారు. అదే కాలంలో రాష్ట్రంలో ఖర్చుచేసింది కేవలం 9.8 శాతం మాత్రమే. 'వాద్ నగర్ హీరో'గా ఉన్న మోదీ, తాజాగా 'గంగై కొండాన్' గా మారినట్లు నమ్మిస్తున్నారు అంటూ ఎంపీ వెంకటేశన్ ట్వీట్ చేశారు.

చేపల వేటకు నిషేధం

పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జాలర్లు చేపల వేటకు సముద్రంలో వెళ్లేందుకు నిషేధం విధించారు. ఆంధ్ర రాష్ట్రం శ్రీహరికోట నుంచి గురువారం జీఎస్ఎల్వీ -ఎఫ్ 16 అంతరిక్ష నౌకను రాకెట్ ద్వారా ప్రయోగించనున్నారు. రాకెట్ ప్రయోగం కారణంగా భద్రతా కారణాల దృష్ట్యా పళవేర్కాడు, పరిసర గ్రామాలకు చెందిన జాలర్లు గురువారం చేపల వేటకు సముద్రంలోకి వెళ్లేందుకు నిషేధం విధించినట్లు జిల్లా యంత్రాంగం ప్రకటన విడుదల చేసింది.

విమానాశ్రయం సమీపంలో 'లేజర్ లైట్'పై నిషేధం పొడిగింపు

పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కంలోని విమానాశ్రయం సమీపంలో లేజర్ లైట్ వేయడం, ఎయిర్ బెలూన్లు, డ్రోన్ తదితరాలు ఎగురవేసేందుకు విధించిన నిషేధం సెప్టెంబరు 24 వరకు పొడిగించారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ ఉత్తర్వులు జారీచేశారు. విమానాశ్రయం సమీపంలోని ఇళ్లు, వీధులు, భవనాలు, క్రీడా మైదానాలు, హోటళ్లు, విడిది గృహాలు తదితర ప్రాంతాల్లో నిషేధిత ఉపకరణాలు వినియోగించకూడదని నగర పోలీసు శాఖ సూచించింది.

రహదారి ఆక్రమణలను తొలగించాలంటూ

అవినాశిలో వ్యాపారులు, కౌన్సిలర్ల నిరాహారదీక్ష

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా అవినాశిలో రహదారి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేస్తూ వ్యాపారులు, కౌన్సిలర్లు, స్థానికులు సోమవారం ఉదయం కొత్త బస్టాండు ప్రాంతంలో నిరాహార దీక్ష చేశారు. అవినాశి పాత బస్టాండు, కొత్త బస్టాండు, కోయంబత్తూరు మెయిన్‌రోడ్డు, అవినాశి - కోవూరు రహదారికిరువైపులా ఆక్రమణలు అధికంగా ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. రహదారులను ఆక్రమించుకున్నవారిని తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ తాధికారులు, ప్రభుత్వ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆక్రమణలను తొలగించేంత వరకూ తాము ఆందోళనను కొనసాగిస్తామని కూడా స్థానికులు, వ్యాపారులు హెచ్చరించారు.


నిరాహారదీక్ష చేస్తున్న వ్యాపారులు, కౌన్సిలర్లు

ప్రధాని మోదీని కలుసుకుంటాం

● పొత్తుపై జనవరిలో ప్రకటిస్తాం
● డీఎండీకే నేత విజయ్ ప్రభాకరన్



చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల వ్యూహరచనలో భాగంగా ప్రధాని మోదీని కలుసుకుని పొత్తుపై చర్చలు జరుపుతామని, పొత్తుపై జనవరిలో అధికారికంగా ప్రకటిస్తామని డీఎండీకే యువజన విభాగం కార్యదర్శి విజయ ప్రభాకరన్ తెలిపారు. సోమవారం ఉదయం కోవైలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆగస్టు 3నుంచి పార్టీ ప్రచారం తిరువల్లూరు జిల్లా గుమ్మిడిపూండిలో ప్రారంభమవుతుందని, 'ఉల్లమ్ తేడి.. ఇల్లమ్ నాడి' అనే నినాదంతో ప్రచారంచేస్తామని తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత రాష్ట్రమంతటా రోడ్‌షో నిర్వహించి ప్రచారం చేస్తారని చెప్పారు. మొదటి విడత ప్రచార పర్యటన ఆగస్టు 28 వరకు కొనసాగుతుందని తెలిపారు. జనవరి 9న కడలూరులో పార్టీ మహానాడు జరుగుతుందని, ఆ మహానాడులో ఏయే పార్టీలతో పొత్తు కుదుర్చుకుంటామనే విషయమై అధికారికంగా ప్రకటిస్తామన్నారు. కమల్‌హాసన్ రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక కావటం పట్ల తమ పార్టీ హర్షం ప్రకటిస్తోందని, రాజకీయాల్లోనూ ఆయన బాగా రాణిస్తారని విజయ ప్రభాకరన్ పేర్కొన్నారు.

శివకాశి నియోజకవర్గంలోనే పోటీ చేస్తా

● అన్నాడీఎంకే నేత రాజేంద్ర బాలాజీ


మీడియాతో మాట్లాడుతున్న రాజేంద్ర బాలాజీ

ప్యారీస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో శివకాశి నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని అన్నాడీఎంకే నేత, మాజీమంత్రి రాజేంద్ర బాలాజీ పేర్కొన్నారు. సోమవారం జరిగిన శివకాశి అన్నాడీఎంకే నాయకుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, శివకాశి ప్రజలు తనను ఎమ్మెల్యేగా పలుమార్లు గెలిపించారని, ఈ గడ్డమీద నుంచే మంత్రి పదవిలో కూడా కొనసాగానని, ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసే భాగ్యం కలగటం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. 2026లో అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో ఇక్కడి నుంచే పోటీ చేయాలని ఆశిస్తున్నానని, తనకు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తప్పకుండా అవకాశం కల్పిస్తారని నమ్మకం వ్యక్తంచేశారు.

ఉత్తర చెన్నై చిహ్నం.. ఎంఎం థియేటర్ కూల్చివేత



పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై చిహ్నంగా పేరుగాంచిన ఎంఎం థియేటర్ ప్రాంగణం అపార్ట్‌మెంట్‌గా మారనుంది. దీంతో, థియేటర్ కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. తండయార్‌పేట-తిరువొత్తియూర్ హై రోడ్డులో ఉన్న ఎంఎం థియేటర్ 35 ఏళ్ల క్రితం 772 సీటింగ్‌తో నిర్మించారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో మెట్రో రైలు పనులు చేపట్టడంతో, వాహన పార్కింగ్‌కు స్థలం లేక థియేటర్ వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోయింది. మెట్రోరైలు పనులు ముగిసి థియేటర్ ప్రారంభించాలన్నా, పార్కింగ్ లేకపోవడం, కొత్త సాంకేతిక సౌకర్యాలు లేకపోవడంతో నష్టాల్లో కొనసాగించడం కష్టమని భావించిన యాజమాన్యం మార్చి నుంచి థియేటర్‌ను మూసివేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి, థియేటర్ కూల్చేవేత ప్రారంభమైంది. దీంతో, ఉత్తర చెన్నై చిహ్నంగా ఉన్న ఎంఎం థియేటర్ ఇంక కనిపించదని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి సుబ్రమణ్యంపై కేసు రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయొచ్చా?

● కౌంటర్ దాఖలుకు సుప్రీం ఆదేశం

అడయార్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి ఎం.సుబ్రమణ్యంపై దాఖలైన కేసును రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయొచ్చా? అని సుప్రీం కోర్టు ప్రశ్నిస్తూ, ఈ అంశంలో పిటిషనర్, రాష్ట్రప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. గిండీలోని కార్మికుల కాలనీలో కె.కన్నన్ అనే వ్యక్తికి ఇల్లు కేటాయించారు. ఈ ఇంటిని నకిలీ పత్రాలతో ఆ సమయంలో కార్పొరేటర్‌గా ఉన్న సుబ్రమణ్యం తన భార్య పేరుమీద రిజిస్టర్ చేయించుకున్నట్టు సైదాపేటకు చెందిన పార్తిబన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీంతో సుబ్రమణ్యంతో పాటు మరికొందరిపై మోసం, అవినీతి చట్టం కింద కేసు నమోదు కాగా, ఈ కేసు ప్రస్తుతం ప్రజాప్రతినిధుల అవినీతి కేసులు విచారించే ప్రత్యేక కోర్టులో విచారణ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ సుబ్రమణ్యం మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేయగా, దాన్ని తోసిపుచ్చుతూ కేసు నమోదు చేసి విచారణ కొనసాగించాలని ప్రత్యేక కోర్టును ఆదేశించింది. ఈ తీర్పుపై మంత్రి సుబ్రమణ్యం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై న్యాయమూర్తులు సుధాన్షు, అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి.. ఈ కేసు విచారణ రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయొచ్చా? అని ప్రశ్నిస్తూ, దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పిటిషనర్‌ను ఆదేశించింది.

రోడ్డుపై విరిగిపడిన బస్సు డోరు


డోరు తీసుకెళ్తున్న డ్రైవర్, కండక్టర్

పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న ప్రభుత్వ బస్సు డోరు విరిగిపడిన ఘటన వాహన చోదకులను భయభ్రాంతులకు గురిచేసింది. కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చి నుంచి సోమవారం ఉదయం వాల్పారైకు బస్సు బయల్దేరింది. పొల్లాచ్చి-వాల్పారై రోడ్డుపై వస్తున్న బస్సు డోరు హఠాత్తుగా విరిగి రోడ్డుపై పడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో బస్సు పక్కగా ఏ వాహనం వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. బస్సుకు అమర్చిన ఆటోమేటిక్ డోరు పనిచేయడం లేదని డ్రైవర్, కండక్టర్ పలుమార్లు అధికారులకు తెలిపినా ప్రయోజనం లేకపోయిందని, బస్సుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని రవాణా సంస్థ కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

దివ్యాంగ విద్యార్థులకు గ్రూప్-2 ,2ఏ పరీక్షలకు ఉచిత శిక్షణ

పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులకు గ్రూప్-2, 2ఏ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు చెన్నై జిల్లా యంత్రాంగం విడుదల చేసిన ప్రకటనలో.. గిండిలోని స్పెషల్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో టీఎన్‌పీఎస్సీ నిర్వహించనున్న గ్రూప్-2 2ఏ పరీక్షలకు హాజరయ్యే దివ్యాంగ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఈ నెల 21 నుంచి ప్రారంభమైనట్టు తెలిపింది. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మైలాపూర్ శాంథోమ్ హైరోడ్డులోని సీఎస్ఐ డెఫ్ హయ్యర్ సెకండరీ స్కూలులో తరగతులు నిర్వహించనున్నారు. అర్హత కలిగిన దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు నకలు, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ నకళ్లు తదితరాలను ఈ నెల 13వ తేదిలోగా ఆన్‌లైన్‌లో సమర్పించి, తరగతులకు హాజరుకావచ్చని, మరిన్ని వివరాలకు తరగతులు నిర్వహించనున్న పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా యంత్రాంగం తెలిపింది.

రైతుల సమస్యలు తెలిపే 'ఉళవర్ మగన్'

దేశంలోని రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు వివరిస్తూ రూపొందిన చిత్రం 'ఉళవర్ మగన్'. పా.అయ్యప్పన్ కథ సమకూర్చి దర్శకత్వం వహించారు. ఈయన గతంలో 'ధోని కబడ్డీ కుళు', 'కచ్చికారన్' వంటి చిత్రాలను తెరకెక్కించగా, ఇది ఆయనకు మూడో చిత్రం. వ్యవసాయం నేపథ్యంలో రూపొందే ఈ మూవీని శుభలక్ష్మి ఫిలిమ్స్ పతాకంపై కె.మురుగన్ నిర్మించారు. ఇందులో హీరోహీరోయిన్లుగా కౌశిక్, సిమ్రాన్ రాజ్, విన్సెంట్ జార్జ్ నటించగా, విజిత్ శరవణన్ ప్రతి నాయకుడి పాత్ర పోషించారు. యోగారామ్, రంజన్ కుమార్, శివసేనాధిపతి, కుమార వడివేలు తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'విరుదాచలం, ఉళుందూరుపేట, కల్లకుర్చి తదితర ప్రాంతాల్లోని వ్యవసాయ భూముల్లో 40 రోజుల పాటు చిత్రీకరించాం. నిర్మాణ పనులను పూర్తి చేసుకుని వచ్చే నెల 8వ తేదీ విడుదల చేస్తున్నాం. యాక్షన్ రియాక్షన్ నిర్మాణ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా రిలీజ్ చేసేలా ప్లాన్ చేసింది.


'ఉళవర్ మగన్' ఓ దృశ్యం

ఇక కథాపరంగా చూస్తే, దేశంలో వ్యవసాయ రంగాన్ని అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ కారణంగా రైతులు జీవనోపాధిని కోల్పోతున్నారు. అనేక మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రతి రోజూ రైతులు పడే బాధలు, కష్టాలు, దుఃఖాలను వివరించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలను కూడా ప్రస్తావిస్తాం' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

ఎస్ఆర్ ప్రభాకరన్ దర్శకత్వంలో 'రెక్కై ములైత్తేన్'


దర్శకుడు ప్రభాకరన్

స్టోన్ ఎలిఫెంట్ క్రియేషన్స్ బ్యానరుపై ఎస్ఆర్ ప్రభాకరన్ నిర్మించి దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'రెక్కై ములైత్తేన్'. థ్రిల్లింగ్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు. తాన్య రవిచంద్రన్ ప్రధాన పాత్ర పోషించారు. ఆగస్టులో విడుదల చేయనున్నారు. ఈ చిత్రం గురించి దర్శకుడు వివరిస్తూ, 'ఇప్పటివరకు చేసిన చిత్రాలకు ఇది పూర్తిగా భిన్నం. థ్రిల్లింగ్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ. స్వయంగా కథ సమకూర్చి దర్శకత్వం వహించాను. ఆగస్టులో విడుదల చేస్తాం. ప్రతి చిత్రంలోనూ ఏదైనా కొత్తగా ప్రయత్నించాలని భావిస్తుంటాను. దానికి అనుగుణంగా ప్రారంభం నుంచి ముగింపు వరకు ఉత్కంఠభరితంగా ఈ స్క్రీన్‌ప్లే సాగుతుంది. కాలేజీలో చేరగానే కొత్తగా రెక్కలు వచ్చినట్టుగా భావించే విద్యార్థులు ఒకవైపు, ఒక షాకింగ్ క్రైమ్ కేసు విచారణలో నిమగ్నమైన పోలీస్ అధికారి పాత్రలో తాన్య రవిచంద్రన్ మరోవైపు. ఈ రెండు అంశాలను సమన్వయం చేస్తూ కథ ముందుకు నడిపించాను. ఖచ్చితంగా ప్రతి ఒక్కరికీ నచ్చుతుందన్న నమ్మకం ఉంది' అన్నారు. కాగా, ఎస్ఆర్ ప్రభాకరన్ 'సుందర పాండియన్', 'ఇదు కదిర్‌వేల్ కాదల్', 'సత్రియన్', 'కొంబు వెచ్చ సింగమ్‌డ' వంటి చిత్రాలతో పాటు 'సెంగళం' అనే వెబ్ సిరీస్‌లో కామెడీ, రొమాన్స్, యాక్షన్ ఇలా అన్ని జానర్ చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు.

మనిషి జీవితంపై 'రాహుకేతు' ప్రభావమెంత?

● 8న విడుదల


'రాహుకేతు'లో సముద్రఖని - కస్తూరి

రాహుకేతువులు మనిషి జీవితంపై చూపించే ప్రభావం.. ఇత్యాది అంశాలతో తెరకెక్కిన చిత్రం 'రాహుకేతు'. ఇది తమిళ చిత్రపరిశ్రమలో మూడున్నర దశాబ్దాల తర్వాత ఆధ్యాత్మిక భక్తిరస చిత్రంగా రూపుదిద్దుకుంది. వచ్చే నెల ఎనిమిదో తేదీ ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. 'తమిళ్‌మామణి' దురై బాలసుందరం దర్శకత్వం వహించారు. ప్రముఖ సినీ దర్శకుడు దివంగత ఏపీ నాగరాజన్ తర్వాత భారత పురాణాలను ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని నిర్మించే సినిమాలు తమిళంలో రావని భావిస్తున్న తరుణంలో దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 'రాహుకేతు' పేరుతో తమిళ ప్రేక్షకులకు భక్తిరస చిత్రాన్ని అందించే ప్రయత్నం చేశారు. చిత్ర నిర్మాణ పనులన్నీ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉందని దర్శకుడు చెప్పారు. ఇందులో శివుడు పాత్రలో ప్రముఖ నటుడు సముద్రఖని, దుర్గామాతగా కస్తూరి, మహావిష్ణువుగా విఘ్నేష్ నటించారు. వీరితో పాటు అనేక మంది సీనియర్ నటీనటులు వివిధ పాత్రలను పోషించారు. తమిళరసన్ పతాకంపై నిర్మాత శాంతి బాలసుందరం నిర్మించగా, ఎస్.ఆనంద్, వి.ఉమాదేవి సహ నిర్మాతలుగా వ్యవహరించారు. ఛాయాగ్రహణం మోహన్ అందించగా, భరణీధరన్ సంగీత సమకూర్చారు.

ఇటు సినిమాలు.. అటు వాణిజ్య ప్రకటనలు

● దూసుకెళుతున్న సాక్షి అగర్వాల్



కోలీవుడ్ యువనటి సాక్షి అగర్వాల్ కొంతకాలంగా వరుస అవకాశాలు దక్కించుకుంటూ తన సినీ కెరీర్‌ను కొనసాగిస్తోంది. ఇటు సినిమాలు, అటు వాణిజ్య ప్రకటనల్లో నటిస్తూ రెండు చేతులా సంపాదిస్తూ దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా ముందుకుసాగుతోంది. 2019లో 'బిగ్‌బాస్ సీజన్-3'లో పాల్గొని పాపులారిటీని దక్కించుకున్న సాక్షి అగర్వాల్ కేవలం నటి మాత్రమే కాకుండా మంచి మోడల్ కూడా. అనేక చిత్రాల్లో నటించి మంచి పేరు తెచ్చుకున్న సాక్షి అగర్వాల్. 2013లో 'రాజారాణి', 2018లో 'కాలా', 2021లో 'సిండ్రెల్లా', 2023లో 'భగీరా' వంటి హిట్ చిత్రాల్లో నటించింది. 'కాలా' చిత్రంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ కుమార్తెగా నటించగా, ఓ తమిళ టీవీలో ప్రసారమయ్యే 'నాంగ రెడీ నీంగ రెడీయా' రెండో సీజన్‌కు న్యాయనిర్ణేతగా కూడా వ్యవహరిస్తున్నారు. 2025 జనవరి 2 తేదీ తన చిన్ననాటి స్నేహితుడు నవనీత్‌ను వివాహం చేసుకున్న సాక్షి అగర్వాల్ ప్రస్తుతం కామరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆంత్రాలజీ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అలాగే, స్మార్ట్ ఫోన్లతో పాటు పలు కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆడిపూరం వేడుకలు

● అమ్మవార్లకు విశేష అలంకరణ



మేల్ మళయనూర్‌లో అమ్మవారికి 2.51లక్షల గాజులతో అలంకారం - 50వేల గాజులతో అలంకారంలో కట్రంపట్టి గ్రామదేవత

ప్యారీస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గోదాదేవి జన్మనక్షత్రం రోజున సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఆడిపూరం వేడుకలను అత్యంత వైభవంగా జరుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారి జన్మనక్షత్రం కావడంతో మహిళలు విలువైన కానుకలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. విల్లుపురం జిల్లా సెంజి సమీపంలోని మేల్ మళయనూర్ అంకాల పరమేశ్వరి ఆలయంలో సుమారు 2.51లక్షల గాజులతో ఉత్సవమూర్తి, మూలవర్లకు విశేష అలంకారం చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. మదురై జిల్లా తిరుమంగళం సమీపంలోని కట్రంపట్టి గ్రామంలో పురాతన రఘుపతి కృష్ణ కొండమ్మాళ్ ఆలయంలో ఆడిపూరం సందర్భంగా 50వేల గాజులతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మదురై, విరుదునగర్, తిరునల్వేలి తదితర జిల్లాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో సేవించుకున్నారు.

మేల్ మరువత్తూరులో...

చెంగల్పట్టు జిల్లా మేల్ మరువత్తూరు ఆదిపరాశక్తి పీఠంలో సోమవారం 54వ వార్షిక ఆడిపూరం నిర్వహించారు. ఈ సందర్భంగా అశేష భక్తజనం సమక్షంలో ఆలయ నిర్వాహకులు లక్ష్మీ బంగారు అడిగలార్ అమ్మవారికి మహా క్షీరాభిషేకం, అలంకారం చేశారు. కార్యక్రమంలో అన్బలగన్, సెందిల్‌కుమార్, శ్రీదేవి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లక్షమొక్కల పథకం


లయన్స్ క్లబ్ సభ్యులకు మొక్కలు పంపిణీ చేస్తున్న నూతన కార్యవర్గం

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ 3241-సి జిల్లా విభాగం ఆధ్వర్యంలో లక్ష మొక్కలు నాటే పథకాన్ని అమలు చేయనున్నట్లు జిల్లా విభాగం కొత్త గవర్నర్‌గా పదవీ స్వీకారం చేసిన పీఎంజేఎఫ్ లయన్ ఎస్.బోస్ తెలిపారు. స్థానిక కలైవానర్ అరంగంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కొత్త కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. చెన్నై గ్రీన్‌సిటీ లయన్స్ క్లబ్, చెన్నై అభిరామపురం లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో లయన్ బి.శేఖర్ సహకారంతో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు లక్ష మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి మొక్కలను పంపిణీ చేశారు. ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ మాజీ డైరెక్టర్ లయన్ సంపత్, జోనల్ అధ్యక్షులు డాక్టర్ పి.ధనపాల్, ధనశేఖర్, జయగోకుల్, ఆంటోని గ్రీన్ సిటీ క్లబ్ లయన్ ఎస్ కన్నన్, లయన్ ఎం.అన్నామలై, లయన్ హరికృష్ణన్, అభిరామపురం లయన్స్‌క్లబ్ సభ్యులు బి. శేఖర్, శరవణన్, తదితరులు హాజరయ్యారు.

వాసవీ మహిళా విభాగం ఆధ్వర్యంలో

గోదై నాచియార్ వైభవ పూజ


గోదాదేవి పూజలో శ్రీవాసవీ మహిళా విభాగం సభ్యులు

ప్యారీస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వాసవీ మహిళా విభాగ్ ఆధ్వర్యంలో గోదైనాచియార్ (గోదాదేవి)అమ్మవారి జన్మనక్షత్రమైన ఆడిపూరం సందర్భంగా సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్వాల్‌బజార్ ప్రాంతంలోని ఆదియప్పనాయకన్‌వీధిలో ఉన్న శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పూలు, తులసీ దళాలు, వజ్రాభరణాలు, పట్టువస్త్రాలతో వాసవీ మాతను అలంకరించి, సామూహిక పూజలు నిర్వహించారు. గోదాదేవి విష్ణుమూర్తిని స్తుతిస్తూ అల్లిన 30 పాసురాళ్లను మహిళా విభాగం సభ్యులు పారాయణం చేశారు. ఆడి మాసం సందర్భంగా ఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా లోకకల్యాణార్థం గోదైనాచియార్ వైభవ పూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సభ్యులతో కలిసి విభాగం అధ్యక్షురాలు టి.లావణ్య, కార్యదర్శి జి.సరళ, ట్రెజరర్ బి.సరళ, వైస్ ప్రెసిడెంట్ పి.కల్పన ఈ పూజల్లో పాల్గొన్న భక్తులందరికి పసుపు కుంకుమ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.


ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలుసుకుని రాష్ట్రానికి సమగ్ర శిక్షా అభ్యాన్ పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పిస్తున్న రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, ఎంపీ కనిమొళి



రథంపై సర్వాలంకరణతో కనువిందు చేస్తున్న ఆండాళ్, రంగమన్నార్ - మోకుతాడు పట్టుకుని రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు సాత్తూరు రామచంద్రన్, తంగం తెన్నరసు తదితరులు

శ్రీవిల్లిపుత్తూరులో నేత్రపర్వంగా ఆండాళ్ రథోత్సవం

● 'గోవింద నామస్మరణతో పులకించిన క్షేత్రం


శ్రీవిల్లిపుతూరు ఆలయ రాజగోపురం ముందు కదులుతున్న ఎత్తయిన రథం

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ (గోదాదేవి) ఆలయంలో ఆడిపూర ఉత్సవాల్లో భాగంగా సోమవారం కనులపండువగా రథోత్సవం జరిగింది. అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల్లో శ్రీవిల్లిపుత్తూరులో మూలవర్లు వటపత్రశాయి, పెరియాళ్వార్ (విష్ణుచిత్తులు) ఆండాళ్ అవతరించిన దివ్యదేశంగా ప్రఖ్యాతిచెందింది. ఆండాళ్ అవతరించిన ఆడి మాసం పూరం (పూర్వఫల్గుణి) నక్షత్రదినాన ఆడిపూర రథోత్సవం వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ యేడాది ఆడిపూర ఉత్సవాలు ఈ నెల 20న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. తొలి రోజు షోడశ స్వర్ణసప్పరాలపై ఆండాళ్ ఊరేగారు. ఐదోరోజున పంచ గరుడవాహనాలపై పెరియపెరుమాళ్, రంగమన్నార్, తిరువణ్ణామలై శ్రీనివాసపెరుమాళ్, కాట్టళగర్ సుందరరాజ పెరుమాళ్, తిరుత్తంగళ్ అప్పన్ స్వామి ఊరేగారు. ఏడో రోజు శనివారం రాత్రి ఆండాళ్ వడిలో రంగమన్నార్ శయనించారు. ఆదివారం రాత్రి ఆండాళ్ పూలపల్లకీలోనూ, రంగమన్నార్ స్వర్ణ అశ్వవాహనంపై ప్రధాన వీధుల్లో విహరించారు. సోమవారం ఉదయం రథోత్సవాన్ని పురస్కరించుకుని మూలవర్లకు పుష్పాంజలి, అద్దాలమండపంలో ఆండాళ్, రంగమన్నార్‌లకు ఏకాంత తిరుమంజనం నిర్వహించారు. ఆ తర్వాత ఆండాళ్ సర్వాలంకరణశోభితురాలై, పసుపురంగు పట్టు చీర ధరించి, రంగమన్నార్ శ్వేత పట్టు వస్త్రం ధరించి రథమండపం వద్దకు వేంచేశారు. ఆ తర్వాత వైష్ణవపండితుల మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ ఇద్దరూ రథం పీఠంపై ఆసీనులయ్యారు. ఆండాళ్‌కు శ్రీరంగం రంగనాథస్వామి ఆలయం, మదురై అళగర్ కోవిల్ నుండి తీసుకొచ్చిన పట్టు వస్త్రాలు సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు కూడా చేశారు. ఉదయం 9.10 గంటలకు మంత్రులు సాత్తూర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, జిల్లా కలెక్టర్ సుఖపుత్రా, శ్రీవిల్లిపుత్తూరు ఎమ్మెల్యే మాన్‌రాజ్, మేయర్ సంగీత, ఎస్పీ కన్నన్, తహసీల్దార్ బాలాజీ తదితరులు మోకుతాడును పట్టుకుని లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ చతుర్మాడ వీధుల్లో భక్తులు గోవిందా.. గోపాలా అంటూ భక్తిపారవశ్యంతో నినాదాలు చేశారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు కార్పొరేషన్ ఉన్నతాధికారులు తగు సదుపాయాలు కల్పించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని పలు సంఘాల ఆధ్వర్యంలో మజ్జిగ, పండ్ల రసాలను పంపిణీ చేశారు. పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు.


శ్రీరంగం, మదురై ఆలయాల నుండి ఆండాళ్, రంగమన్నార్‌లకు సారె తీసుకు వస్తున్న ఆలయాల అధికారులు

'ఆసియా సర్ఫింగ్ పోటీ' శిక్షణ ప్రారంభం



పెరంబూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మహాబలిపురం సముద్రతీరంలో సోమవారం ఉదయం 'ఆసియా సర్ఫింగ్ పోటీ'ల తొలివిడత శిక్షణ ప్రారంభమైంది. ఈ శిక్షణలో దేశ, విదేశాలకు చెందిన 120 మంది పాల్గొన్నారు. ఆసియా సర్ఫింగ్ అసోసియేషన్, తమిళనాడు సర్ఫింగ్ అసోసియేషన్ సంయుక్తంగా మహాబలిపురంలో 'ఆసియా సర్ఫింగ్ ఛాంపియన్‌షిప్-2025' పోటీలు ఆగస్టు 3 నుంచి 12వ తేది వరకు నిర్వహించనున్నాయి. ఈ పోటీల్లో భారత్, ఆఫ్ఘనిస్తాన్, చైనా, ఇండోనేసియా, జపాన్, మలేసియా, సౌదీ అరేబియా, సింగపూర్ తదితర 20 దేశాలకు చెందిన 120 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ క్రమంలో, మహాబలిపురం సముద్ర తీరంలో సోమవారం ఉదయం విదేశాలకు చెందిన క్రీడాకారులు, సముద్రపు అలల్లో సర్ఫ్ బోర్డులు ఉపయోగించి శిక్షణలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో భారత్ నుంచి 12 మంది క్రీడాకారులు పాల్గొంటుండగా, వారిలో 8 మంది రాష్ట్రానికి చెందిన వారు కావడం గమనార్హం.


చెన్నైలో సోమవారం అన్నాడీఎంకే సభ్యత్వం స్వీకరించి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామనాథపురం సంస్థానం యువరాజు రాజా నాగేంద్ర సేతుపతి


మద్రాస్ విశ్వవిద్యాలయం మెరీనా ప్రాంగణం డైరెక్టర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరిస్తున్న విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు

కేఆర్ఆర్ఈకి 'క్యూఎస్ ఐ-గేజ్ రేటింగ్'


అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

అడయార్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కలశలింగం అకాడమీ ఆఫ్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (డీమ్డ్ వర్సిటీ)కు 'క్యూఎస్ ఐ-గేజ్ రేటింగ్' ప్లాటినం బ్రాండ్ లభించింది. దేశంలో అత్యధిక రేటింగ్ పొందిన ఐదో సంస్థ అని వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శశి ఆనంద్ శ్రీధరన్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవార్డును తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అందజేశారు. బోధన, అభ్యాసం, ఫ్యాకల్టీ నాణ్యత, ఉపాధి, విద్యార్థుల వైవిధ్యం, మౌలిక సదుపాయాలు, సామాజిక బాధ్యత, ఆవిష్కరణ వంటి అంశాల్లో మెరుగైన ప్రమాణాలు కలిగి దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో క్యూఎస్ ఐ-గేజ్ దేశ వ్యాప్తంగా తొలి రేటింగ్ కలిగిన సంస్థగా గుర్తింపు పొందింది. ఈ రేటింగ్‌లను లండన్‌లోని క్యూఎస్ ఇంటలిజెన్స్ యూనిట్ పర్యవేక్షిస్తుంది. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో డీమ్డ్ వర్సిటీ వైస్ చాన్సలర్ రిజిస్ట్రార్, డైరెక్టర్లు, డీన్స్, ప్రొఫెసర్లు, చాన్సలర్ డాక్టర్ కె.శ్రీధరన్ ప్రశంసించారు.

ఎస్ఆర్ఎం వర్సిటీలో ఘనంగా సెంటినరీ తమిళ సదస్సు


సదస్సులో పాల్గొన్న నిర్వాహకులు, కుండ్రకుడి అడిగలార్ తదితరులు

ప్యారీస్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాటాన్‌కొళత్తూరులోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ తమిళ పేరాయం (సంఘం), సాహిత్య అకాడమీ, తిరువణ్ణామలై కుండ్రకుడి ఆధీనం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సెంటినరీ తమిళ సదస్సు నిర్వహించారు. విద్యార్థుల్లో పఠనాసక్తి, తమిళంపై అవగాహన కల్పించేలా నిర్వహించిన ఈ సదస్సులో కుండ్రకుడి అడిగలార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినయవిధేయతలు, జాలి, ప్రేమ వంటి అంశాలు పాటిస్తే సమాజం గౌరవిస్తుందని, ఈ లక్షణాలను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. ఈ సదస్సులో ఆర్.దామోదరన్, తమిళ సంఘం అధ్యక్షులు కరునాగరాజన్, భారతి కృష్ణకుమార్, నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





గోపిచంద్ మలినేని - శివరాజ్ కుమార్

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల శ్రీవారిని సోమవారం సినీ దర్శకుడు గోపిచంద్ మలినేని, కన్నడ నటుడు శివరాజ్ కుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఐటీసీటీఏ పురస్కారం అందుకుంటున్న జిల్లా టూరిజం ఆర్డీ రమణప్రసాద్

ఏపీ టూరిజానికి ప్రతిష్ఠాత్మక అవార్డు

ఇంటర్నేషనల్ టూరిజం కాన్‌క్లేవ్ అండ్ ట్రావెల్ (ఐటీసీటీఏ) సంస్థ ఏపీలో చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టులు, ప్రభుత్వ నిర్ణయాలను పరిశీలించింది. 'ఎమర్జింగ్ కోస్టల్ అండ్ హెరిటేజ్ అవార్డును' ప్రకటించింది. ఈ అవార్డును శనివారం ఢిల్లీలో ఆ సంస్థ ప్రతినిధుల నుంచి జిల్లా పర్యాటకశాఖ ఆర్‌డీ రమణ ప్రసాద్ అందుకున్నారు. కొన్ని కారణాలతో పర్యాటకఅభివృద్ధి కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలి వెళ్లకపోవడంతో తిరుపతి ఆర్డీ రమణ ప్రసాద్ అందుకున్నారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.85 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 85,486

తలనీలాలు సమర్పించినవారు: 30,929





వాకాడు డిపో నమూనాను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ

బస్టాండ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం

● ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

వాకాడు/వెంకటగిరి టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అన్ని ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల కోసం కుర్చీలు, ఫ్యాన్‌ల ఏర్పాటుతో సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు తెలిపారు. వాకాడు, వెంకటగిరిలోని డిపోలు, బస్టాండ్లను సోమవారం ఆయన తనిఖీ చేశారు. వాకాడు డిపో ఆవరణంలో మొక్కలను నాటారు. రెండు చోట్లా డిపో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. మీడియాతో మాట్లాడారు. బస్టాండ్లకు కొత్తగా రంగులు వేస్తున్నామని తెలిపారు. వాకాడు డిపో ఆవరణలో సిమెంట్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయనున్నామన్నారు. అన్ని డిపోలో బస్సు సర్వీసులు ఎలా ఉన్నాయో జోన్ల వారీగా తెలుసుకుని కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో వెంకటగిరి, వాకాడు డిపోలను పరిశీలించి సర్వీసులు, సిబ్బందికి సూచనలు అందించామన్నారు. వెంకటగిరిలో మరో రెండు ప్లాట్ ఫారాలు ఏర్పాటు చేసి అత్యాధునిక బస్టాండ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఆర్టీసీ ఎండీ వెంట ఈడీ చంద్రశేఖర్, ఈడీఈ చెంగల్‌రెడ్డి, ఈడీవో అప్పలరాజు, వెంకటగిరి, వాకాడు డీఎంలు రామకృష్ణ, పెంచలయ్య, సిబ్బంది ఉన్నారు.

పులి..జాడ ఎక్కడ?

● శేషాచల అడవుల్లో అంతరిస్తున్న వైనం
● ఎస్వీ జూకే పరిమితం
● నేడు జాతీయ పులుల దినోత్సవం



జూపార్కులో రాయల్‌బెంగాల్ టైగర్

దేశంలో పులుల సంఖ్య

సంవత్సరం	పులుల సంఖ్య
2006	1,411,
2010	1,726
2014	2,226
2018	2,927
2022	3,682 (అంచనా)





జూపార్కులో తెల్ల పులి



పెద్దపులులు

మంగళం, జూలై 28(ఆంధ్రజ్యోతి): పెద్దపులి.. వేటలో రారాజు.. రాజసానికి ప్రతీక. దీనిపేరు వింటేనే జనానికి ముచ్చెమటలు పడతాయి. కదలికలో చురుకుదనం, చూపులో తీక్షణం, గాండ్రింపులో వైవిధ్యమున్న ఈ మృగం ఉనికి నానాటికీ అంతరించి పోతోంది. అభయారణ్యంగా పేరొందిన మన శేషాచల అటవీప్రాంతంలో వ్యాఘ్రం మచ్చుకైనా లేదంటే ఆశ్చర్యం,ఆవేదన కలుగుతాయి. ఇప్పుడు పులులు ఎస్వీ జూకు మాత్రమే పరిమితమయ్యాయి.

చాన్నాళ్లుగా ఉనికే లేదు..

దట్టమైన అడవి పెద్దపులులకు ఆవాసానికి అనుకూలం. అడవుల పరిరక్షణలో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. శేషాచల పరిధిలోని ఆహార వనరులు, రాతి గుహలు, సెలయేళ్లు, నీటి గుంటలు పులుల మనుగడకు ఉపకరించేవి. ఈ దృష్ట్యా ప్రభుత్వం ఏడాది క్రితం నల్లమల నుంచి బద్వేల్ మీదుగా శేషాచలం వరకు ప్రత్యేక కారిడార్‌గా ప్రకటించింది. నాలుగు జిల్లాల్లో నాలుగు లక్షల హెక్టార్ల పరిధిలో విస్తరించిన ఈ కారిడార్‌లో చాన్నాళ్లుగా పులి సంచరించిన దాఖలాలు లేవని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఆరేళ్ల కిత్రం చామల రేంజ్ అటవీప్రాంతంలో ఓ పెద్దపులిని గుర్తించినా తర్వాత ఉనికి లేదు. తాజాగా నెల్లూరు, కడప జిల్లాల మధ్య పులుల కార్యకలాపాలున్నట్లు భావించినా నిర్ధారణ కాలేదు. నాగార్జునసాగర్-శ్రీశైలం రిజర్వు ఫారెస్ట్‌లో 95 పెద్దపులులున్నాయని అంచనా.

జూపార్కులో పులుల సందడి

అంతరించిపోతున్న పెద్దపులు పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తిరుపతి ఎస్వీ జూపార్కులో రెండు బెంగాల్ టైగర్స్, తొమ్మిది తెల్లపులులు సందర్శకులు కనువిందు చేస్తున్నాయి. రెండేళ్ల క్రితం తీసుకువచ్చిన నాలుగు పిల్లల్లో రెండు చనిపోయాయి. ఇక్కడి పులులకు రోజూ అర లీటరు పాలు, ఐదు నుంచి 6కిలోల బీఫ్, రెండు కేజీల చికెన్,రెండు కోడిగుడ్లు వంతున ఆహారంగా అందిస్తున్నారు. ఇందుకోసం ఏడాదికి రూ.4,85,4590 ఖర్చవుతుంది. ఈక్రమంలోనే పులులను దత్తత తీసుకుని ఆహారానికి కొంత ఆర్థిక సాయం సమకూర్చాలని జంతు ప్రేమికులకు జూ అధికారులు కోరుతున్నారు.

ప్రతి అర్జీకీ పరిష్కారం చూపండి

పరిష్కారం కాని పక్షంలో వివరణ ఇవ్వండి ● అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం ● కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 260 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో దానికి కారణాలు తెలుపుతూ వివరణ ఇవ్వాలని జిల్లా అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి వినతులు సమర్పించారు. కొన్ని అర్జీలకు అక్కడికక్కడే వర్చువల్ విధానంలో కలెక్టర్ పరిష్కారం చూపారు. వివిధ సమస్యలపై మొత్తం 260 అర్జీలు రాగా, అందులో రెవెన్యూ శాఖకు 125 ఉన్నాయి.

పింఛను కోసం మూడేళ్లుగా తిరుగుతున్నా..



నేను మూడేళ్ల క్రితం మానసిక వైకల్యానికి గురయ్యాను. ప్రభుత్వ వైద్యాధికారులు ధ్రువపత్రం కూడా ఇచ్చారు. మూడేళ్లుగా వికలత్వ పింఛను కోసం కార్యాలయాల చుట్టు తిరుగుతూనే ఉన్నాం. అధికారులు పట్టించుకోవడంలేదు. భార్యతో పాటు ఇద్దరు పిల్లలను పోషించడం కష్టంగా ఉంది. పింఛను మంజూరు చేసి ఆదుకోండి.

- గంగయ్య, టీకేపురం, పిచ్చాటూరు మండలం

గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించండి



నా భర్తకు అనారోగ్యం. నాకు క్యాన్సర్ కారణంగా కాలు తొలగించారు. మా అమ్మాయి పదవ తరగతిలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ సీటు ఇప్పించండి.

- లక్ష్మి, నాగనందవరం, వరదయ్యపాళెం మండలం

చెరకు రైతుల బకాయిలు చెల్లించండి

మయూర షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెరకు రైతులకు ఆరేళ్లుగా బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతోందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రూ.16కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని, షుగర్ ఫ్యాక్టరీ ఆస్తులు జప్తుచేసి వీలైనంత త్వరగా చెల్లించాలని రైతులతో కలిసి కలెక్టర్‌ను కోరారు.

రోడ్డు ఏర్పాటు చేయండి



మా గ్రామంలో 180 కుటుంబాలున్నాయి. జాతీయ రహదారి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. 50 ఏళ్లుగా డొంక రోడ్డులో ప్రయాణం చేస్తున్నాం. వర్షాకాలం వచ్చిందంటే అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న రెండు కిలోమీటర్లు తారు రోడ్డు వేశారు. రిజర్వు ఫారెస్టు ఉన్న రెండు కిలోమీటర్లు అలాగే వదిలేశారు. పలుమార్లు అర్జీలు సమర్పించినా పట్టించుకోవడం లేదు. అత్యవసర సమయాల్లో చాలా ఇబ్బంది పడుతున్నామని, రోడ్డు ఏర్పాటు చేయాలని డక్కిలి మండలానికి చెందిన వీకేవై సముద్రం గ్రామ ప్రజలు కలెక్టర్‌కు విన్నవించారు.

మా బడి మాకు కావాలి



తుంబూరు హరిజనవాడవాసుల ధర్నా

'మా బడి మాకు కావాలి' అంటూ నారాయణవనం మండడలం తుంబూరు హరిజనవాడకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. తమ గ్రామంలో 56 మంది విద్యార్థులు ఉండగా పక్క గ్రామంలోని 11మంది విద్యార్థులతో కూడిన పాఠశాలతో విలీనం చేయడం దుర్మార్గమన్నారు. విద్యా సంవత్సరం మొదలై 3 నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. వీరికి ఏఐఎస్ఎఫ్ నేతలు శివారెడ్డి, ఉదయ్, ప్రవీణ్‌కుమార్ సంఘీభావం ప్రకటించారు.



పల్లంపేటవాసుల ఆందోళన

మా ఊరిలో 60 మంది పిల్లలు చదువుతున్నారు. వారిని మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లం హరిజనవాడ పాఠశాలలో ఎలా విలీనం చేస్తారంటూ ఏర్పేడు మండలం పల్లంపేట వాసులు ప్రశ్నించారు. ఈ మేరకు తల్లిదండ్రులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. పిల్లలు జాతీయ రహదారిపై నడచివెళ్లడం ప్రమాదకరమని, దీన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాల విలీనం ఆలోచనను రద్దు చేయాలని కోరారు.

ప్రజా వినతులకు తక్షణ పరిష్కారం

- అధికారులకు ఎస్పీ ఆదేశం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారమూ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వినతులకు నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపాలని ఎస్పీ హర్షవర్ధనరాజు అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు హాజరైన ప్రజల సమస్యలను ఆయన స్వయంగా తెలుసుకుని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఇందులో 10 ఏళ్ల నాటి సమస్య ఒక్క రోజులో పరిష్కారం కావడంతో అర్జీదారులు సంతోషం వ్యక్తం చేశారు. మిగిలిన వినతులను ఆయా స్టేషన్లకు పంపారు. దాదాపు 100 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు, రవిమనోహరాచారి, సీఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రంగనాయక మండపంలో వెంకయ్యనాయుడికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న అదనపు ఈవో

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయంలోకి వెళ్లిన వెంకయ్య నాయుడు ధ్వజస్తంభానికి, తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ, కుటుంబ సమేతంగా భగవత్ దర్శనం చేసుకోవడం చాలా సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. హిందూ ధర్మం ప్రకారం దైవభక్తి ఉండటంతో పాటు సమాజ భక్తి, సేవ, అనురక్తి కూడా కలిగి ఉండాలని సూచించారు.

విధి నిర్వహణలో ఉన్నరైల్వే హెడ్ కానిస్టేబుల్ మృతి

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉండగానే రైల్వే హెడ్ కానిస్టేబుల్ కళ్లు తిరిగి కింద పడి మృతి చెందారు. ఈ ఘటన సోమవారం తిరుపతి రైల్వే స్టేషన్‌లోని మొదటి ప్లాట్‌ఫారంలో చోటుచేసుకుంది. రైల్వే సీఐ ఆశీర్వాదం తెలిపిన ప్రకారం.. తిరుపతి జీఆర్‌పీఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వై.ఎరికలరెడ్డిది కడప జిల్లా తొండూరు మండలం ఇనగనూరు గ్రామం. ఈయన ఏడేళ్లుగా రైల్వే విభాగంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఒకటో ప్లాట్‌ఫారంలో విధి నిర్వహణలో వుండగా నీళ్ళు తాగడం కోసం రైల్వే స్టేషన్ వద్దకు వచ్చే క్రమంలో కళ్లు తిరిగి కింద పడ్డారు. అక్కడున్న పోలీసులు చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు రైల్వే సీఐ ఆశీర్వాదం చెప్పారు.

నన్ను టార్గెట్ చేసి నిర్బంధించారు

● వైల్డ్‌లైఫ్ అండ్ మాక్రో ఫొటోగ్రాఫర్ సిద్ధార్థ



తిరుపతి(జీవకోన), జూలై 28(ఆంధ్రజ్యోతి): శేషాచల అడవుల్లోని ప్రకృతి అందాలను బాహ్యప్రపంచానికి వెబ్‌పేజీ ద్వారా చూపుతున్న తనను టార్గెట్ చేసి పుత్తూరు అటవీశాఖ కార్యాలయంలో అక్రమంగా నిర్బంధించారని వైల్డ్‌లైఫ్ అండ్ మాక్రో ఫొటోగ్రాఫర్ సిద్ధార్థ ఆరోపించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీశాఖ నిబంధనల ప్రకారం సదాశివకోన, జలపాతాలను, దేవాలయాలను సందర్శించాలని 20 మంది స్నేహితులతో కలిసి అటవీశాఖ టిక్కెట్లను కొని ఆదివారం వెళ్లామన్నారు. తిరుగు ప్రయాణంలో తమకు అనుమతిచ్చింది ఈ ప్రదేశం వరకే అంటూ పుత్తూరు అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లి రాత్రంతా గదిలో పెట్టి తాళంవేశారన్నారు. తాను చేసిన తప్పేంటని ప్రశ్నించినా పొంతనలేని సమాధానం చెప్పారన్నారు. సోమవారం ఉదయం 10గంటలకు ప్రాంతంలో తమ వద్ద హామీ పత్రాన్ని రాయించుకుని వదిలి పెట్టారన్నారు. తనను అరెస్టు చేసినట్లు, అపరాధ రుసుం కట్టించుకున్నారని జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ చెప్పినట్లుగా సామాజిక మాధ్యమంలో చూశానన్నారు. దివ్యారామంలో చెట్లు నరికిన అంశంపై తాను చేసిన వీడియో అప్పట్లో వైరల్‌గా మారడంతోనే ఇలా కక్ష సాధింపుగా వ్యవహరిస్తున్నారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. 9 ఏళ్లుగా ప్రకృతి అందాలను చిత్రీకరించి బాహ్య ప్రపంచానికి చూపుతున్న తనకు, ఒక రాత్రిలో పరువు పోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదేమి ట్రెండ్!



ఒకప్పుడు సమాజాన్ని ప్రభావితం చేసిన నేతల బొమ్మలతో యువత టీ షర్టులు వేసుకునేవారు. ఆ తర్వాత కొటేషన్లు.. క్రమేణా తమ అభిమాన సినీ హీరోలు, రాజకీయ నేతల చిత్రాలతో టీ షర్టులు ధరిస్తూ వచ్చారు. ఇలా తమ అభిమానం చూపుకొనే వారు. మరిప్పుడు గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ ఫొటోతో కూడిన టీ షర్టులు ధరిస్తుండటం జనాన్ని విస్మయానికి గురిచేస్తోంది. ఇలా.. సోమవారం తడలోని శివాలయానికి ఓ భక్తుడు వీరప్పన్ ఫొటోతో ఉన్న టీషర్టు వేసుకుని రావడంతో 'ఇదేమి ట్రెండ్' అంటూ చర్చనీయాంశంగా మారింది. ఈ టీషర్టు రూ.300 అని, చెన్నైలో వీటికి మంచి డిమాండ్ ఉందంటూ ఆ యువకుడు చెప్పడం గమనార్హం.

- తడ, ఆంధ్రజ్యోతి

షార్‌లో పలు ప్రాజెక్టులు ప్రారంభం

సూళ్లూరుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో రూ.486.22 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న పలు ప్రాజెక్టులను సోమవారం ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ప్రారంభించారు. సాలీడ్ ప్రొపెల్లెంట్ ప్లాంట్ అగ్మెంటేషన్ (ఎస్‌పీఏజీ), 10 టన్నుల మిక్సర్ ప్లాంట్, కెమికల్ టెస్టింగ్ ల్యాబ్, విద్యుత్ ఉపకేంద్రం, ఆధునికీకరించిన పరిపాలన భవన సముదాయాలను ప్రారంభించారు. సూళ్లూరుపేట సమీపంలోని షార్ ఉద్యోగుల కాలనీలో నూతనంగా నిర్మించనున్న క్వార్టర్స్ భవనాలకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

15 వేల మందికి బియ్యం పంపిణీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా 26 నుంచి 30 వరకు దివ్యాంగులకు, వృద్ధులకు ఇళ్ల వద్దకు తీసుకెళ్లి రేషన్ సరుకులు అందిస్తున్నారు. 61,251 మందికిగాను ఈ నెలలో మూడు రోజులుగా 15 వేల మందికి బియ్యం పంపిణీ చేసినట్లు డీఎస్‌వో శేషాచలం రాజు చెప్పారు.